క్లుప్తంగా

23న ఆలయ భూముల బహిరంగ వేలం

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఈ నెల 23వ తేదీ ఆలయ భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రూపు దేవస్థానం ఈఓ చంద్రేఖర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి 11 ఎకరాలు, రామస్వామి దేవస్థానానికి ఉన్న 11.31 ఎకరాలు, చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించి 257.14 ఎకరాల భూములకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన రైతులు అదే రోజు ఉదయం 10 గంటలలోగా రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. పాత బకాయిలు ఉన్న వారు వేలం పాటకు అనర్హులుగా ప్రకటించారు. వేలంలో పాల్గొన్న వారిలో హెచ్చు పాట దక్కించుకున్న వారికి ఏడాది పాటు భూములను కౌలుకు అనుభవించే హక్కును కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

కోడుమూరు రూరల్: స్థానిక మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లతో పరీక్షకు హాజరు కావాలని, హాల్ టికెట్ డౌన్‌లోడ్ కాని విద్యార్థులు 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఉదయాన్నే పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

నివాళి

కర్నూలు(రూరల్): మాజీ ఎంపీపీ దివంగత నాయకుడు డి.రాజవర్ధన్ రెడ్డి వర్ధంతిని ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గౌరు చరితా రెడ్డి తదితరులు పాల్గొని రాజవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కోడుమూరు రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది ఆదివారం గ్యాస్ లీకేజీ, ఎలక్ట్రికల్ వల్ల కలిగే అగ్ని ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని, అనుకోకుండా ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అగ్నిమాపక ఎస్ఐ మహబూబ్ దౌలత్ మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, పెట్రోల్ బంకు యజమాని వీరన్న, అగ్నిమాపక సిబ్బంది మరూఫ్, శ్రీనివాసులు, మల్లికార్జున, మహేశ్వరరెడ్డి, దివాకర్‌రెడ్డి, బ్రహ్మేశ్వరరావు, గిడ్డయ్య, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గౌసియా బేగం

కోడుమూరు రూరల్: పరీక్షలు, మార్కులే జీవితం కాదని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ గౌసియా బేగం విద్యార్థినులకు సూచించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలకు ముందుగా విద్యార్థినులను మానసిక ధైర్యాన్ని ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె విద్యార్థినులతో సమావేశమయ్యారు. జీవిత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు మానసిక స్థిరత్వంతో ముందుకెళ్లాలని సూచించారు. పరీక్షల్లో ఫెయిలైనంత మాత్రనా అంతా అయిపోయినట్లు కాదని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్ కౌన్సిలర్ సుచరిత పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల రక్తదానం



రక్తదానం చేస్తున్న మంత్రి భరత్, ఎంపీ నాగరాజు

కర్నూలు(రూరల్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు రక్తదానం చేశారు. ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి వారు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కేట్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- రైతుకు మంట పుట్టిస్తున్న మిరప
- భారీగా పడిపోయిన ఎండు మిర్చి ధరలు
- ఖర్చులకు కూడా రాని పరిస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో రైతులు

ఘాటు లేని రేటు



వైరస్‌తో దెబ్బతిన్న మిర్చి పంట (ఫైల్)



ఎండుమిర్చిని గుంటూరు మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు

గడివేముల: ఎండు మిర్చి రైతులకు మంట పుట్టిస్తోంది. ధరలు అమాంతం పడిపోవడంతో వచ్చే ఆదాయం ఖర్చులకు కూడా సరిపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యానవన పంటల్లో మిర్చి ప్రధానమైంది. ప్రతిరోజూ వంటకాల్లో వాడుకోవాల్సి ఉన్నప్పటికీ.. ఎండు మిర్చి ధర మాత్రం దిగజారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో భారీగా నష్టపోతున్నారు. ఒకవైపు ప్రకృతి అనుకూలించక, మరోవైపు ధర పడిపోవడంతో జిల్లాలో పచ్చి మిర్చి రైతుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. దళారులు సిండికేట్‌గా మారి పంటను తక్కువ ధరకు కాజేసి అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. విత్తన దశలో పంట ధరలు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు మిర్చి వంటపై ఆసక్తి చూపారు. మండల కేంద్రమైన గడివేములతో పాటు బిలకలగూడూరు, మంచాలకట్ట, గని, కొర్రపాలూరు, తిరుపాడు గ్రామాల్లో ఎక్కువగా మిర్చి పంటను సాగు చేశారు. మండలంలో ఏటా అధికంగా పచ్చిమిర్చి సాగు చేస్తారు.ఈ ఏడాది మండలంలో 1500 ఎకరాల్లో సాగు చేశారు. రెండేళ్ల నుంచి ఎండు మిర్చి పంట సాగు చేసిన రైతులు అధిక లాభాలు ఆర్జించారు. దీంతో ఈ ఏడాది కూడా లాభాలు వస్తాయని ఆశించి మిర్చి సాగుచేసిన రైతులు ఒక్కసారిగా ధరలు గణనీయంగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

పంటకు వైరస్ దెబ్బ

ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం పెరిగింది. ఒకేసారి దిగుబడి రావడంతో ధర గణనీయంగా తగ్గింది. మిర్చి నిల్వ చేసుకోవడానికి వసతులు లేకపోవడమే ధర తగ్గడానికి కారణమని రైతులు అంటున్నారు. వైరస్, నల్లదోమ, తామర పురుగు వల్ల కూడా మిర్చి పంట కొంత దెబ్బతింది. దీంతో మిర్చి పంటను తొలగించి వేరే పంటలు సాగు చేశారు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు 15 కింటాళ్లు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొరగా వచ్చిన దిగుబడులకు ధర లేకపోకపోవడంతో చాలా నష్టం వచ్చే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడిని గుంటూరు మిర్చి యార్డ్‌కు తరలించి అమ్ముకుంటారు. కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు అకాల వర్షాలతో పంట దెబ్బతిన్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. మరల మిర్చి పంట సాగు చేయాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందంటే ఎంతలా రైతులు నష్టపోయారో అర్థం చేసుకోవచ్చు.

భారీగా తగ్గిన ధర

రెండేళ్ల నుంచి క్వింటా రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు పలికింది. ఇదే విధంగా ధర ఉంటుందని ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. ఎకరాకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు కలుపుకుని రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటా ప్రస్తుతం రూ.11 వేల నుంచి 12 వేల వరకు పలుకుతోంది. భారీగా నష్టం రావడంతో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. గిడ్డంగి సౌకర్యం కల్పించి ధర తక్కువ ఉన్నప్పుడు నిల్వ చేసుకుని ఎక్కువ ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



నేను 6 ఎకరాల్లో తేజ రకం ఎండుమిర్చి సాగు చేశా. ఎకరానికి రూ.2 లక్షలు ఖర్చయింది. దిగుబడి బాగా వస్తుందని అనుకుంటున్న సమయంలో వైరస్, తామర పురుగు వల్ల పంట దెబ్బతింది. క్వింటా ఇప్పుడు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే పలుకుతోంది. ఇదే కొనసాగితే కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. మిర్చిని నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులు ఉంటే ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది.

–తలారి బాలచెన్ని, మిర్చి రైతు, గడివేముల

ధర ఇంతలా తగ్గుతుందని ఊహించలేదు



నేను 7 ఎకరాల్లో ఎండ మిర్చి సాగు చేశా. కొన్నేళ్ల నుంచి ఎండు మిర్చి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది పంటలకు వివిధ రకాల వైరస్‌లు సోకడంతో పెట్టుబడి పెరిగింది. పెట్టుబడి పెరిగినా దిగుబడి మాత్రం అంతంత మాత్రంగా ఉంది. ధర ఎన్నడూ లేని విధంగా తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మిర్చి రైతులకు న్యాయం చేయాలి.

–కురువ శివ, మిర్చి రైతు, గడివేముల

కొంత మిర్చి పంటను దున్నేశాను



బోరు కింద 11 ఎకరాల నాటు, తేజ రకం మిరప పంటను సాగుచేశాను. దాదాపు ఎకరాకు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టాను. తామర పురుగుతో 3 ఎకరాలు మిరప పంట పూర్తిగా దెబ్బతినడంతో దున్నేసి వేరే పంటను వేశాను. మిగతా 8 ఎకరాల కాయలను కోస్తే అధికంగా తాలుకాయ వచ్చింది. దీంతో ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. లాభం వచ్చే పరిస్థితి లేదు.

–పైపాలెం ఉసేని, మిరప రైతు, గడివేముల

కల్లూరులో ఈదురుగాలులతో వర్షం



దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కల్లూరు: కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. మండలంలోని కె.మార్కాపురం, ఎ.గోకులపాడు, సల్కాపురం గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం పడింది. అలాగే కల్లూరు అర్బన్ ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది.

పరిష్కార వేదికకు హాజరు కావాలి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు విన్నవించుకుంటారని, అధికారులు కచ్చితంగా హాజరై పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ చేత ఫిజియోథెరపీ చేయిస్తున్నట్లు తెలిపారు.

చరిత్రలో నిలిచేలా దాసి పన్నా రచన



సాహితీ వేత్త జేఎస్ఆర్కే శర్మను సన్మానం చేస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: విద్వాన్ షేక్ దావూద్ రచించిన 'దాసి పన్నా' చరిత్రలో నిలిచిపోతుందని సాహితీ వేత్త జేఎస్ఆర్కే శర్మ అన్నారు. సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆచార్య ఎన్వీ కృష్ణమూర్తి స్మారకోపన్యాసం, విద్వాన్ షేక్ దావూద్ రచించిన 'దాసి పన్నా'పై సాహిత్య ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాహితీ వేత్త జేఎస్ఆర్కే శర్మ మాట్లాడుతూ త్యాగానికి మారుపేరు దాసి పన్నా అన్నారు. పన్నాదైగా పిలవబడే ఈమె 16వ శతాబ్దానికి చెందిన రాణా సింగ్ కుమారుడైన ఉదయ్ సింగ్‌ను కాపాడటం కోసం తన సొంత కన్నబిడ్డనే శత్రువు ఖడ్గానికి బలి పెట్టిందని గుర్తు చేశారు. దాసి పన్నా దేశభక్తి, ధర్మానికి పట్టం కట్టిన తీరు చరిత్రాత్మకమన్నారు. సాహితీ సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, ఉగాది పురస్కార గ్రహీతలు డాక్టర్ హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్‌లను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు షేక్ దావూద్ ఖాన్, ఎన్వీ కృష్ణమూర్తి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపన్యాసకులు షేక్ అబ్దుల్ ఖాదర్, సాహితీ వేత్తలు డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, హైమావతి, సీతామహాలక్ష్మి, నీలిమ, సుశీల, లక్ష్మి, లక్ష్మయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, గంగధార్ రెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి



అగ్నిమాపక ఆయుధాలను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్) : జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ఆదివారం స్థానిక బి.క్యాంపు అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. జనసంచారం ఉండే అపార్టుమెంట్లు, సినిమా హాలు, ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పాఠశాలలు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు వంటి ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు, ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు 101కు సమాచారం ఇవ్వాలన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ అగ్నిమాపక దళం సేవలు వెలకట్టలేనివన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు దానికి కారణమైన ఒక్కొక్క అంశాన్ని నివారించుకుంటూ ప్రమాద తీవ్రతను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డిజాస్టర్ మేనేజ్ మెంటు డీపీఎం అనుపమ, జిల్లా ఫైర్ ఆఫీసర్ అవినాష్ జయసింహ పాల్గొన్నారు.

నర్సింగ్ హోంపై ఫిర్యాదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సునితనర్సింగ్ హోంపై తగిన చర్య తీసుకోవాలని కోరుతూ ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు పట్టణానికి చెందిన ఎంఎన్ ప్రియాంక, ఆమె భర్త ప్రకాశం తెలిపారు. ఎంఎన్ ప్రియాంక మాట్లాడుతూ.. 9 నెలలు నిండిన తాను పరీక్షల నిమిత్తం ఈనెల 29న ఆసుపత్రికి వెళ్లగా.. అష్టమి వున్నందున వైద్యురాలు రాదని చెప్పి సిబ్బంది నిర్లక్ష్యం చేశారని ఆరోపించింది. మరుసటి రోజు వెళ్లగా.. పరీక్షించిన డాక్టర్ గర్భంలోనే శిశువు చనిపోయిందని చెప్పి కర్నూలులోని ఓ ప్రైవేట్ అస్పత్రికి పంపారన్నారు. క్రమం తప్పకుండా సునిత నర్సింగ్‌హోమ్‌లోనే తాను వైద్య పరీక్షలు చేయించుకునేదానినని, చివరి రోజుల్లో డాక్టర్ నిర్లక్ష్యం చేసి శిశువు మృతికి కారణమైందని వాపోయింది.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: మండలంలోని చిన్నహరివాణం గ్రామానికి చెందిన లోకన్న(55) కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. చిన్నహరివాణం గ్రామానికి చెందిన లోకన్న ఈనెల 13వ తేదీన పర్వతాపురం గ్రామంలో జరిగిన అల్లయ్య ఉత్సవంలో పాల్గొన్నాడు. రాత్రి ఆలయంపై పడుకొని, ఉదయం లేచి మెట్లు దిగుతుండగా కాలుజారి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.





ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న కాటసాని, మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాటసాని

కాటసాని పరామర్శ

ఓర్వకల్లు: మండలంలోని కొమరోలు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అప్పన్నను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురై గౌరిగోపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆస్పత్రికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తీరు, బాధితుని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

సుబ్బారెడ్డికి నివాళి

పాణ్యం: విశ్రాంత వీఆర్‌ఓ సద్దల సుబ్బారెడ్డి (75) సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కొండజుటూరు గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్‌ఓ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన అన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారితో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, గోరుకల్లు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లప్ప, రోషి, కంద్రిప్రసాద్ ఉన్నారు.

- భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కరుణామయుడు ఏసు



కల్లూరు: పెద్దటేకూరు చర్చిలో దైవ సందేశం వింటున్న మహిళలు



సి.బెళగల్: ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

సి.బెళగల్: మండల వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఏబీఎం చర్చిలో పాస్టర్ చంద్రశేఖర్ క్రైస్తవులకు దైవ సందేశం ఇచ్చారు. అలాగే పలు ప్రార్థనా మందిరాల్లో సంఘ కాపరులు శిలుపై ఏసుప్రభువు పలికిన ఏడు మాటలను ప్రబోధించారు. పోలకల్, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి, కంబదహాల్, పలుకుదొడ్డి, కొండాపురం, ముడుమాల, ఇనగండ్ల, కొత్తకోట, మారందొడ్డి, కె.సింగవరం, ఈర్లదిన్నె, గుండ్రేవుల గ్రామాల్లోనూ క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

కల్లూరు: ఈస్టర్‌ను పురస్కరించుకుని ఆదివారం కల్లూరు అర్బన్ ప్రాంతాలతో పాటు లక్ష్మీపురం, పెద్దటేకూరు, బస్తిపాడు, చిన్నటేకూరు, సల్కాపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసు పునరుద్ధానం గురించి సందేశం ఇచ్చారు. అందరూ ఇతరులపై ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.





ఓర్వకల్లు: ద్రాక్షరసంతో ఆశీర్వదిస్తున్న పాస్టర్, గడివేములలో రంగులు చల్లుకుంటున్న యువత

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, నన్నూరు, పూడిచెర్ల, ఓర్వకల్లు, శకునాల, హుసేనాపురం, కాల్వ గ్రామాల్లో క్రైస్తవులు పునరుత్తాన(ఈస్టర్) పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఏబీఎం, సీఎస్ఐ, ఆర్‌సీఎం, సెవెన్త్‌డే ప్రార్థనా మందిరాలు క్రైస్తవులతో కిటకిటలాడాయి. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ పాస్టర్ ఆనందరాజు బైబిల్ సందేశం వినిపించారు.

పాణ్యం: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు రంగులు చల్లుకుంటూ ఈస్టర్‌ను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాణ్యం బీసీ కాలనీలోని ఆగాపే చర్చిలో పాస్టర్ ఏసన్న ఈస్టర్ విశిష్టతను వివరించారు. అనంతరం అన్నదానం చేశారు.

గడివేముల: మండలంలోని ఆయా చర్చిలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మతపెద్దలు దైవ సందేశాన్ని వినిపించారు. క్రీస్తు జననం లోకానికి వెలుగని, ఆయన రాక అందరికీ శుభోదయమని పేర్కొన్నారు. మానవాళిని పాపముల నుంచి రక్షించేందుకు ఏసుప్రభువు ఈ లోకానికి వచ్చారని తెలిపారు.

శుభకార్యం



సి.బెళగల్‌లో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాయికాటి పెద్ద మద్దిలేటి కుమారుడి వివాహానికి పార్టీ కోడుమూరు నియోజకవర్గ నాయకులు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

– సి.బెళగల్

లాడ్జీల్లో పోలీసుల సోదాలు



లాడ్జిలో రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసులు పలు లాడ్జీలలో సోదాలు చేపట్టారు. లాడ్జీలకు వచ్చే వ్యక్తుల వివరాలు, గుర్తింపు కార్డులు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కొత్తగా వచ్చే వారి విషయంలో పూర్తి సమాచారం తీసుకున్న తర్వాతే రూమ్‌లు ఇవ్వాలని చెప్పారు. అలాగే రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లాడ్జీల్లో బస చేసిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావిచ్చిన గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీఎస్సీలో ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీలో జిల్లా అభ్యర్థులందరికీ ఒకే పేపర్..ఒకే రోజు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. అభ్యర్థుల అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. డీఎస్సీ సిలబస్ చదవడం కోసం కనీసం 60–90 రోజుల సమయం పడుతుందన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన సమయం సరికాదన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తరువాత పరీక్ష నిర్వహణకు 90 రోజులు వ్యవధి ఉండాలన్నది నిబంధన అని, దానిని పాటించకుండా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోందన్నారు.

చెరుకులపాడు వాసికి గిన్నిస్ బుక్‌లో చోటు

కర్నూలు కల్చరల్: వెల్దుర్తి మండలం చెరుకులపాడుకు చెందిన కొమ్ము చిరంజీవులు కాలాంతక్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. గత డిసెంబర్ 1న హలెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆగస్టిన్, దండింగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా పోటీలు నిర్వహించారు. దేశవిదేశాల నుంచి వేలాది మంది పాల్గొన్న ఈపోటీల్లో చిరంజీవులు కీ బోర్డు ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి లండన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు పొందడంతో హైదరాబాద్‌లో సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు, జ్ఞాపిక అందజేసినట్లు చిరంజీవులు తెలిపారు.

డీఎస్సీని ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): పరీక్షకు దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థికి సమన్యాయం జరగాలంటే డీఎస్సీ పరీక్షను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ప్రస్తుతం నోటిఫికేషన్ ప్రకారం డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో దాదాపు నెల రోజులపాటు జరుగుతాయన్నారు. ఈ క్రమంలో ఒకే రోజు ఆఫ్‌లైన్లో అందరికీ ఒకేసారి పరీక్ష నిర్వహిస్తే సమన్యాయం జరుగుతుందన్నారు.

చిటారు కొమ్మన చిన్నోడు!

చెట్టులెక్క గలవా! ఓ నరహరి పుట్టలెక్కగలవా! చెట్టునెక్కి ఆ చిట్టారు కొమ్మన చిగురు కోయగలవా అని ఓ కవి వర్ణించాడు. కవి చెప్పిన పాటలో మాదిరిగా ఓ చిన్నోడు చిటారు కొమ్మన చిగురు కోస్తున్నాడు. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో ఉన్న చింత వనంలో చెట్టుపై చిగురు కోస్తున్న దృశ్యం కనిపించింది.

–కల్లూరు

